సాక్షి
వనపర్తి
మంగళవారం । 10 । డిసెంబర్ । 2024



పాలమూరు ఆతిథ్యం
సీఎం కప్–2024 రాష్ట్రస్థాయి నెట్‌బాల్, కబడ్డీ పోటీలకు పాలమూరు వేదిక కానుంది.
వివరాలు 8లో ▸



పత్తి రైతుల రాస్తారోకో
పత్తి కొనుగోళ్లలో సీసీఐ జాప్యాన్ని నిరసిస్తూ రైతులు ఓబ్లాయిపల్లిలో రాస్తారోకో చేశారు.
వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
34.7 /25.6
వాతావరణం
రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతం అవుతుంది. చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

యాసంగికి సన్నద్ధం


జూరాల ఆయకట్టులో మొదలైన సాగు పనులు



అమరచింత శివారులో యాసంగి సాగుకు సిద్ధం చేసిన నారుమడి

- పొలం చదును, నారుమడులు సిద్ధం చేసుకుంటున్న అన్నదాతలు
- నిన్నటి వరకు వరి కోతలతో బిజీ.. బిజీ
- వరి సాగుకే మొగ్గు
- నీటి సరఫరాపై ఐడీబీ సమావేశంలోనే నిర్ణయం

అమరచింత: పంట కోతలు, ధాన్యం అమ్మకాలతో నిన్న, మొన్నటి వరకు బిజీగా ఉన్న అన్నదాతలు ప్రస్తుతం యాసంగి సాగుకు సమాయత్తమవుతున్నారు. వానాకాలం పంటలు ఆశించిన మేర చేతికందడంతో కాస్త ఊపిరి పీల్చుకున్న రైతన్న మరోమారు వరి సాగుకు పొలాలను దుక్కి దున్ని సిద్ధం చేసుకుంటుండగా.. మరికొందరు నారుమడి పనుల్లో లీనమయ్యారు. ప్రతి యాసంగిలో ఐడీబీ సమావేశం నిర్వహించి జూరాల జలాశయం ఎడమ కాల్వ ఆయకట్టు పరిధిలోని 85 వేల ఎకరాలకు అధికారులు వారాబంధి విధానంలో సాగునీరు వదులుతారు. దీంతో ఏడాదికి రెండు పంటలను ఆయకట్టు రైతులు పండించగలుగుతున్నారు. కానీ ఈ ఏడాది సమావేశం జరగకముందే రైతులు పంటల సాగుకు సన్నద్ధం అవుతున్నారు. ఆయకట్టు పొలాలు ఇతర పంటల సాగుకు అనుకూలంగా లేకపోవడంతో వరిని మాత్రమే సాగు చేయాల్సి వస్తోంది.



జూరాల ఎడమ కాల్వలో నీటి ప్రవాహం

- జూరాల ఎడమకాల్వ ఆయకట్టు పరిధి జిల్లాలోని అమరచింత, ఆత్మకూర్, మదనాపురం, పెబ్బేర్, శ్రీరంగాపురం, చిన్నంబావి, వీపనగండ్ల మండలాల్లోనే అధికంగా ఉంది. ఆయా మండలాల్లోని ఆయకట్టు రైతులు వారబంధి విధానంలో వదులుతున్న సాగునీటితో యాసంగిలో పంటలు పండించుకోవడానికి సిద్ధమవుతున్నారు. ఎకరా వరిసాగుకు రూ.30 వేల వరకు పెట్టుబడి అవుతుందని.. కూలీల కొరతతో సాగుభారం పెరుగుతున్నా వదలలేకపోతున్నామంటున్నారు.

వరి సాగుకే ప్రాధాన్యం..



యాసంగిలో వరి సాగు చేయడానికి పొలాలను చదును చేసుకొని నారు మడులను సిద్ధం చేసుకుంటున్నాం. కాల్వల ద్వారా నీరు పొలాల్లోకి చేరుతుండటంతో ఆరు తడి పంటల సాగుకు అవకాశం లేదు. ఎకరా సాగుకు రూ.25 వేలకుపైగా పెట్టుబడి అవుతోంది.
– కృష్ణారెడ్డి, రైతు, అమరచింత

ఎత్తిపోతలకు నీరివ్వాలి..



అమరచింత ఎత్తిపోతల పథకానికి జూరాల ప్రాజెక్టు ద్వారా సాగు నీటిని అందించాలి. ఎడ మ కాల్వకు అనుసంధానంగా ఉన్న ఎత్తిపోతల నీటితో 2,200 ఆయకట్టు సాగవుతోంది. సీ–ఫేజ్ కారణంగా ఇతర పంటలు పండించడం వీలు కావడం లేదు. యాసంగిలో సైతం లిఫ్ట్ ఆయకట్టుకు వరిసాగుకే నీటిని అందించాలి.
– కడియాల నర్సింహ, రైతు, అమరచింత

సమావేశంలో నిర్ణయిస్తారు..



ఐడీబీ సమావేశం నిర్వహణపై ఇప్పటి ఎలాంటి సమాచారం లేదు. యాసంగిలో ఆయకట్టుకు సాగునీరు వదలాలా లేదా అన్న విషయం సమావేశంలో మంత్రులు, అధికారులు నిర్ణయిస్తారు. వారి ఆదేశానుసారం ముందుకు సాగుతాం. – జగన్మోహన్, ఈఈ, జూరాల ప్రాజెక్టు నందిమళ్ల డ్యాం డివిజన్

ఆశించిన నీటిమట్టం..
వానాకాలంలో వర్షాలు సమృద్ధిగా కురవడంతో జూరాల జలాశయంలో ఆశించిన మేర నీటినిల్వలు ఉన్నట్టు ప్రాజెక్టు అధికారులు చెబుతున్నారు. 2023 ముందు వరకు నాలుగేళ్ల పాటు జలాశయంలో నీరు ఉండటంతో రెండు పంటలకు సాగునీరు అందించిన అప్పటి ప్రభుత్వం గతేడాది నీటి నిల్వలు లేకపోవడంతో క్రాప్ హాలిడే ప్రకటించింది. ఈసారి కూడా అధికారులు ముందుచూపుతో వారాబంధి విధానంలో నీటి విడుదల చేస్తే సమస్యను అధిగమించవచ్చని రైతులు చెబుతున్నారు.

న్యూస్‌రీల్

కలెక్టరేట్‌కు చెరుకు రైతుల పాదయాత్ర



అమరచింత: తమ పాలిట శాపంగా మారిన కేంద్ర ప్రభుత్వ లోపభూయిష్ట రికవరీ విధానాన్ని రద్దు చేయాలంటూ కృష్ణవేణి చెరుకు రైతుల సంఘం ఆధ్వర్యంలో చెరుకు రైతులు సోమవారం కొత్తకోట నుంచి కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేపట్టారు. అనంతరం సమస్యల వినతిపత్రాన్ని సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజన్న అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లుకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చెరుకు మద్దతు ధర టన్నుకు రూ.ఆరు వేలు చెల్లించాలని, సన్నరకం వరి ధాన్యానికి ఇస్తున్నట్లుగా చెరుకు కూడా బోనస్ ప్రకటించాలన్నారు. ఫ్యాక్టరీలో పనిచేస్తున్న ఫీల్డ్‌మెన్‌లను వేధిస్తున్న జీఎం రూపేష్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని, పరిశ్రమలో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించి న్యాయం చేయాలని కోరారు. రవాణా సమయంలో ఆర్టీఓ, పోలీసుల నుంచి ఎదురవుతున్న ఇబ్బందులను నివారించాలని విన్నవించారు. ఏళ్లుగా కొత్త వంగడాలను ఫ్యాక్టరీ యాజమాన్యం పరిచయం చేయడం లేదని.. దీంతో దిగుబడి లేక రైతులు నష్టపోతున్నా పట్టించుకోవడం లేదన్నారు. వేరుపురుగు సోకిన పంటలకు ఫ్యాక్టరీనే పూర్తిస్థాయిలో పరిహారం ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో వాసారెడ్డి, తిరుపతయ్య, నారాయ, రాజు, అరుణ్, చారి, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం



వీపనగండ్ల: రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో గ్రామీణ ప్రాంతాల్లో సైతం మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని.. పేదలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రోగ్రాం అధికారి డా. వంశీకృష్ణ కోరారు. సోమవారం మండలంలోని కల్వరాలలో రూ.20 లక్షలతో నిర్మించనున్న ఆరోగ్య ఉప కేంద్ర భవనానికి ఆయన భూమిపూజ చేశారు. మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో నిధులు మంజూరు చేయించినట్లు నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి నర్సింహ వివరించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డా. రాజశేఖర్, పంచాయతీరాజ్ ఏఈలు మస్తాన్, విజయ్, అనీల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

14న రాష్ట్ర మహాసభలు

వనపర్తిరూరల్: మహబూబ్‌నగర్‌లో ఈ నెల 14న 'సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం' తొలి రాష్ట్ర మహాసభలు జరగనున్నాయని.. కవులు, కళాకారులు అధికసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని జిల్లా కో–ఆర్డినేటర్ జనజ్వాల, ప్రజాసంఘాల జిల్లా నేతలు పిలుపునిచ్చారు. సోమవారం జిల్లాకేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ప్రజాసంఘాల నేతలు రాష్ట్ర మహాసభల కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. కొన్ని శక్తులు రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసేలా మతతత్వ రాజకీయాలతో ప్రజలను విభజించి సమాజంలో విద్వేషాలను రెచ్చగొడుతున్నాయన్నారు. భిన్న కులాలు, మతాలు, జాతుల మధ్య సామరస్యపూర్వక వాతావరణం, సంస్కృతిని పెంపొందించే దిశగా సాహిత్య రచనలు జరగాల్సిన అవసరం ఉందని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా లౌకిక ప్రజాస్వామ్య విలువలను గౌరవించే కవులు, కళాకారులను సామూహిక రైటర్స్ ఫోరం తొలి రాష్ట్ర మహాసభ ద్వారా ఒక వేదిక మీదకి తెస్తోందన్నారు. జిల్లా మహాసభలను కూడా త్వరలో నిర్వహిస్తామని తెలిపారు. ఏఐటీయూసీ, టీజేఏసీ, పాలమూరు అధ్యయన వేదిక, డీటీఎఫ్ నా యకులు విజయ రాములు, గోపాలకృష్ణ, ర మేష్, శ్రీరామ్, వేణు గోపాల్, ఏసోపు, రమేష్, శ్రీరాం, వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీలకు సత్వర పరిష్కారం



అర్జీదారులతో మాట్లాడుతున్న రెవెన్యూ అదనపు కలెక్టర్ జి.వెంకటేశ్వర్లు

వనపర్తి: సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణికి వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జి.వెంకటేశ్వర్లు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో ఆయనతో పాటు స్థానిక సంస్థల ఇన్‌చార్జ్ కలెక్టర్, జెడ్పీ సీఈఓ యాదయ్య అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం భోజన విరామ సమయం వరకు వచ్చిన అర్జీలతో పాటు సీఎం ప్రజావాణికి దాఖలైన వినతులను సైతం ఆయా శాఖల అధికారులకు సిఫారస్ చేసి పరిష్కరించి సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. కలెక్టరేట్ ప్రజావాణికి 41 అర్జీలు దాఖలైనట్లు గ్రీవెన్స్‌సెల్ అధికారి బి.శ్రీకాంత్‌రావు తెలిపారు.

పోలీసు ప్రజావాణికి 16 వినతులు..



సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ రావుల గిరిధర్

జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఎస్పీ రావుల గిరిధర్ పాల్గొని అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించి వారితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం భోజన విరామ సమయం వరకు మొత్తం 16 అర్జీలు దాఖలయ్యాయి. ఇందులో 8 భూ తగాదాలు, 4 పరస్పర గొడవలు, 4 భార్యాభర్తల వివాదాల అర్జీలు ఉన్నాయి. పరిష్కారానికి అర్జీలను ఆయా ప్రాంతాల పోలీసు అధికారులకు ఎస్పీ సిఫారస్ చేశారు.

పక్కాగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే



అమరచింతలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న స్థానిక సంస్థల ఇన్‌చార్జ్ కలెక్టర్ యాదయ్య

- వివరాల నమోదులో తప్పిదాలకు తావివ్వొద్దు
- స్థానిక సంస్థల ఇన్‌చార్జ్ కలెక్టర్ యాదయ్య

అమరచింత/ఆత్మకూర్: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పక్కాగా చేపట్టడంతో పాటు యాప్‌లో వివరాల నమోదులో తప్పిదాలకు తావివ్వొద్దని స్థానిక సంస్థల ఇన్‌చార్జ్ కలెక్టర్, జెడ్పీ సీఈఓ యాదయ్య ఆదేశించారు. సోమవారం అమరచింత, ఆత్మకూర్ పురపాలికల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే, ఆత్మకూర్‌లో సీఎం కప్ పోటీల నిర్వహణకు జాతర మైదానాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలోని ఐదు పురపాలికల్లో 25,519 మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని.. సోమవారం నుంచి సర్వే ప్రారంభించినట్లు వివరించారు. జిల్లాలోని పురపాలికల్లో మొత్తం 80 వార్డులుండగా.. మొదటిరోజు సోమవారం 57 వార్డుల్లో శిక్షణ పొందిన వార్డు అధికారులతో పాటు పుర, మెప్మా సిబ్బందితో ప్రత్యేక యాప్ ద్వారా లబ్ధిదారులను గుర్తిస్తున్నామన్నారు. మొత్తం 1,425 దరఖాస్తులు అప్‌లోడ్ అయ్యాయని వెల్లడించారు. దరఖాస్తుదారులు సిబ్బందికి ఇంటి స్థలం డాక్యుమెంట్, ఆధార్ కార్డు, విద్యుత్ బిల్లు, పురపాలిక ట్యాక్సు బిల్లు అందించి సహకరించాలని కోరారు. సర్వే సిబ్బంది వివరాలు, జీపీఎస్ ఫొటోతో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరు ఒకరోజు 40 దరఖాస్తులు పూర్తి చేయాలన్నారు. అమరచింత పురపాలికలో మొదటి రోజు 200 వరకు దరఖాస్తులను యాప్‌లో నమోదు చేసినట్లు చెప్పారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట డీపీఓ సురేశ్‌కుమార్, పుర కమిషనర్లు నూరుల్ నదీం, శశిధర్, అమరచింత ఎంపీడీఓ శ్రీనివాసులు, ఆత్మకూర్ చైర్‌పర్సన్ గాయత్రి, వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి ఉన్నారు.

ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తాం : ఎమ్మెల్యే



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

శ్రీరంగాపూర్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పని చేస్తున్నారని.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని వెంకటాపూర్‌లో అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణానికి ఆయన భూమిపూజ చేసి మాట్లాడారు. రాష్ట్రంలో పదేళ్లలో జరగని అభివృద్ధిని ఒక్క ఏడాదిలో చేశామని.. ప్రతిపక్షాలు కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లేందుకు అనవసర ఆరోపణలు చేస్తున్నాయన్నారు. సంక్రాంతి తర్వాత ప్రజలకు మరిన్ని సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఒక్కరోజు కూడా అసెంబ్లీకి రాని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజా సమస్యలపై మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఒక్క ఏడాదిలో నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులకు సుమారు రూ.200 కోట్లకుపైగా మంజూరైనట్లు తెలిపారు. రాజకీయాలను పక్కనబెట్టి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, శ్రీహరి, రాజు, రాజశేఖర్‌రెడ్డి, విజయవర్ధన్‌రెడ్డి, రాజాగౌడ్, వెంకటస్వామి, నరేందర్‌రెడ్డి, కురుమన్న, ఆశన్న, శ్రీనివాస్‌గౌడ్, విజయ్‌కుమార్, ప్రసన్నకుమార్, గోవిందు, విజయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్య, వైద్యానికి పెద్దపీట



- పాఠశాలలు, ఆస్పత్రుల అభివృద్ధికి కృషి
- రూ.170 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల
- కురుమతిరాయుడికి రూ.110 కోట్లు
- దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

సాక్షి INTERVIEW

దేవరకద్ర/అడ్డాకుల: ''ప్రజలు ఎన్నో ఆశలతో బీఆర్‌ఎస్‌ను ఇంటికి పంపించి మమ్మల్ని గెలిపించారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా నియోజకవర్గ అభివృద్ధికి పాడుపడతా. మా నియోజకవర్గంలో విద్య, వైద్యానికి పెద్దపీట వేసి, నిరుపేదలకు మరింత చేరువ చేసే దిశగా అడుగులు వేస్తున్నాం. ఈ రెండు ప్రజలందరికీ అందుబాటులోకి వస్తే ప్రజల జీవన స్థితిగతులు మెరుగుపడి అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో జీవిస్తారు'' అని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికై ఏడాది గడుస్తున్న నేపథ్యంలో నియోజకవర్గంలో ప్రజాపాలనపై ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ గ్రామాలు, మున్సిపాలిటీలను అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. పాలమూరు బిడ్డ సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గాన్ని నంబర్‌వన్‌గా మారుస్తానని పేర్కొన్నారు.

ఏడాది పాలనపై ఆయన మాటల్లోనే..

గత పాలకులు విద్య, వైద్యరంగాన్ని పట్టించుకోలేదు. అందుకే నేను మొదటి నుంచి వీటిపై ఫోకస్ చేశారు. దేవరకద్రకు డిగ్రీ కాలేజీ మంజూరు చేయించాను. అదేవిధంగా చిన్నచింతకుంటకు జూనియర్ కళాశాల ఏర్పాటు చేయించాను. 2,500 మంది విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యను అందించే విధంగా నియోజకవర్గానికి రూ.170 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల మంజూరు చేయించాను. ఇక వైద్యరంగానికి సంబంధించి నియోజకవర్గంలోని అన్ని పీహెచ్‌సీలను అప్‌గ్రేడ్ చేయించడానికి ప్రయత్నిస్తున్నా. దేవరకద్రలో 100 పడకలు, కొత్తకోటలో 50 పడకల ఆస్పత్రులను ఏర్పాటు చేయిస్తా. పీహెచ్‌సీలో మెరుగైన వైద్యం అందించే విధంగా చేసి పేదలకు వైద్యాన్ని మరింత చేరువ చేస్తాం. మూసాపేట మండలం జానంపేట వద్ద హైవేపై ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేయిస్తా.

కురుమతిరాయుడికి రూ.110 కోట్లు

పేదల తిరుపతిగా పేరొందిన శ్రీకురుమూర్తి స్వామి దేవాలయం అభివృద్ధికి కట్టుబడి ఉన్నా. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డిని ఇక్కడికి ఆహ్వానించి కురుమూర్తి స్వామి ఆలయానికి నిధులు మంజూరు చేయించా. దేవాలయం వద్ద ఎలివేటెడ్ ఘాట్ రోడ్డుకు రూ.110 కోట్లు మంజూరు చేయించి శంకుస్థాపన చేయించాం. అదేవిధంగా ఆలయ ఆవరణలో కల్యాణ మండపం, కాటేజీలు, కల్యాణకట్ట కోసం మరో రూ.66 కోట్ల నిధులకు ప్రతిపాదనలు పంపించాం. పదేళ్లలో బీ ఆర్‌ఎస్ ప్రభుత్వం దేవాలయాన్ని పట్టించుకోకుండా వదిలేస్తే సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో మేము ఆలయాభివృద్ధికి కంకణం కట్టుకున్నాం.

దేవరకద్రను మున్సిపాలిటీ చేస్తా

నియోజకవర్గ కేంద్రమైన దేవరకద్రను మున్సిపాలిటీగా చేస్తామని గత ప్రభుత్వం ఇచ్చిన మాటను తప్పింది. వచ్చే ఎన్నికల లోపు దేవరకద్రను మున్సిపాలిటీగా మారుస్తాం. ఇందుకోసం ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డిని కలిశాం. నాలుగు గ్రామాలతో కలిపి దేవరకద్రను మున్సిపాలిటీగా మార్చడానికి ప్రతిపాదనలు పంపించాం. మున్సిపాలిటీగా మార్చిన తర్వాత ఎక్కువ నిధులు తెచ్చి పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసే దిశగా ముందుకు సాగుతాం. దేవరకద్రలో కోర్టును ఏర్పాటు చేయించే విధంగా చర్యలు చేపడతాం. ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ వారి సహకారంతో నియోజకవర్గాన్ని నంబర్‌వన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నా.

రైతులను ఆదుకుంటున్నాం

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చుతున్నాం. ముఖ్యంగా రైతులకు ఆదుకునేందుకు కృషి చేస్తున్నాం. అర్హులందరికీ రుణమాఫీ చేశాం. సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తున్నాం. శంకరసముద్రం కుడి కాల్వలో నీళ్లు పారించి ఆయకట్టు రైతులను ఆదుకునే దిశగా చర్యలు చేపట్టాం. అదేవిధంగా కోయిల్‌సాగర్ కింద ఆదనపు ఆయకట్టు కోసం రూ.217 కోట్లు, చౌదర్‌పల్లి లిఫ్టుకు రూ.100 కోట్లు, అజిలాపూరం లిఫ్టుకు రూ.36 కోట్లు మంజూరు చేయించాం. పెండింగ్‌లో ఉన్న పేరూర్ లిఫ్టు పనులను పూర్తి చేయించి రైతులను ఆదుకుంటాం. బీఆర్‌ఎస్ పాలనలో నిధులు ఇవ్వకపోవడంతో నిలిచిపోయిన పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై దృష్టి సారిస్తాం.

పర్యాటక కేంద్రాల అభివృద్ధికి కృషి

నియోజకవర్గంలోని కోయిల్‌సాగర్, సరళాసాగర్ ప్రాజెక్టులను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దడానికి ప్రయత్నిస్తున్నాం. పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును రెండు చోట్లకు తీసుకెళ్లి స్థానిక పరిస్థితులను వివరించాం. రెండు ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేసి హరిత హోటళ్లు, కాటేజీలు, బోట్లు ఏర్పాటు చేయిస్తాం. దేశంలోని టూరిస్టులను ఇక్కడికి రప్పించే విధంగా అభివృద్ధి చేస్తాం. టెంపుల్ టూరిజం కింద కురుమూర్తి స్వామి దేవాలయం వద్ద అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాం. కోయిల్‌సాగర్ పర్యాటకానికి ప్రస్తుతం రూ.3 కోట్లు మంజూరు చేయించాం.

అలంపూర్ ఆలయాల హుండీ ఆదాయం రూ.1.06 కోట్లు



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

అలంపూర్: అష్టాదశ శక్తిపీఠాల్లో ఐదో శక్తిపీఠమైన జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాల హుండీ ఆదాయం రూ.1,06,04,436 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహక అధికారి పురేందర్‌కుమార్ తెలిపారు. అలంపూర్‌లో వెలసిన జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామివారి ఆలయాల హుండీ లెక్కింపు సోమవారం ఉమ్మడి జిల్లా దేవాదాయ సహాయ కమిషనర్ మదనేశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ సందర్భంగా జోగుళాంబ అమ్మవారి ఆలయ హుండీ లెక్కించడంతో రూ.87,02,578 రాగా.. బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయ హుండీ ద్వారా రూ.18,63,642 ఆదాయం వచ్చిందన్నారు. అలాగే అన్నదాన సత్రం హుండీ ద్వారా రూ.38,216 మొత్తం కలిపి రూ.1,06,04,436 ఆదాయం వచ్చినట్లు ఈఓ పేర్కొన్నారు. అదేవిధంగా విదేశీ కరెన్సీ యూఎస్ డాలర్లు 17, ఆస్ట్రేలియా కరెన్సీ 5, స్వీడన్ కరెన్సీ 1000, మిశ్రమ బంగారం 61 గ్రాములు, మిశ్రమ వెండి 513 గ్రాములు వచ్చింది. ప్రస్తుతం 150 రోజులకు సంబంధించిన హుండీని లెక్కించడంతో ఈ ఆదాయం సమకూరిందని వివరించారు. గతంలో 110 రోజుల హుండీ ఆదాయం లెక్కించగా రూ.58,66,623 వచ్చింది. అయితే ఈసారి కార్తీక మాసం కలిసి రావడంతో గతం కంటే రూ.47,37,813 ఆదాయం అదనంగా వచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, ధర్మకర్తలు నాగశిరోమణి, జగన్ మోహన్‌నాయుడు, విశ్వనాథరెడ్డి, జగదీశ్వర్‌గౌడ్, గోపాల్, వెంకటేశ్వర్లు, ఆలయ ఉప ప్రధాన అర్చకులు, ఎక్స్ అఫీషియో సభ్యులు ఆనంద్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌వి మోసపూరిత హామీలు



తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

గోపాల్‌పేట: వంద రోజుల్లో ఆరు గ్యారెంటీ హామీలు అమలు చేస్తామని మోసపూరిత హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌పార్టీ.. 365 రోజులైనా నెరవేర్చలేదని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఎవరి దయాదాక్షిణ్యాలతో ప్రత్యేక రాష్ట్రం ఏర్పడలేదని.. తెలంగాణ ప్రజలు ఏళ్ల పాటు కొట్లాడి, పోరాడి సాధించుకున్నారని వివరించారు. మోసపోయి కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెట్టామని రాష్ట్ర ప్రజలు ఇప్పటికే చర్చించుకుంటున్నారని, ఇంకా నాలుగేళ్ల పాటు భరించక తప్పదనే స్థితిలో ఉన్నారన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్ నుంచి బస్టాండ్ వరకు పాదయాత్రగా చేసి అక్కడి అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రాం, జ్యోతిరావు పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, మండల అధ్యక్షుడు బాలరాజు, తిరుపతియాదవ్, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైలు నుంచి పడి మహిళ మృతి

మహబూబ్‌నగర్ క్రైం: మహబూబ్‌నగర్ మండలం మన్యంకొండ రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం తెల్లవారుజామున సుమారు 40 ఏళ్ల వయసున్న మహిళ రైలులో నుంచి జారిపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ సయ్యద్ అక్బర్ తెలిపారు. మృతురాలి దగ్గర ఎలాంటి ఆధారాలు లేవని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించామన్నారు. మరిన్ని వివరాలకు రైల్వే పోలీసులను సంప్రదించాలని.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

- శాగాపూర్‌లో విషాదఛాయలు


శ్రీకాంత్‌యాదవ్ (ఫైల్)

పాన్‌గల్: మెదక్ జిల్లాలోని ఏడు పాయల దుర్గామాత దర్శనానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో ఆదివారం రాత్రి నర్సాపూర్ దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. శాగాపూర్‌కు చెందిన శ్రీకాంత్‌యాదవ్ (30), శివరామ్‌యాదవ్ ప్రయాణిస్తున్న కారును ఇన్నోవా కారు ఢీకొన్న ఘటనలో శ్రీకాంత్‌యాదవ్ అక్కడికక్కడే మృతి చెందగా, శివరామ్‌యాదవ్ తీవ్రంగా గాయపడ్డాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. దైవ దర్శనానికి వెళ్లి క్షేమంగా ఇంటికి తిరిగివస్తారనుకున్న కుమారుడి అకాల మరణంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతదేహాన్ని సోమవారం రాత్రికి స్వగ్రామానికి తీసుకురానున్నట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

కుటుంబ కలహాలతో..

పురుగు మందు తాగిన భార్యాభర్తలు

అయిజ: మున్సిపాలిటీకి చెందిన భార్యాభర్తలు భార్గవ్, పల్లవి కుటుంబ కలహాలతో పురుగు మందు తాగిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా.. భార్గవ్, పల్లవిలకు కొన్ని సంవత్సరాల క్రితం వివాహం అయ్యింది. కుటుంబ కలహాల వల్ల భార్యాభర్తలిద్దరూ నంద్యాల జిల్లా యాగంటి దేవస్థానం సమీపంలో పురుగు మందు తాగారు. అక్కడున్న ప్రజలు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో వారు వచ్చి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. ప్రాణాపాయం లేదని వైద్యులు నిర్ధారించారు.

రేషన్ బియ్యం పట్టివేత

మదనాపురం: మండల కేంద్రంలో సోమవారం అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ట్రాలీ ఆటోలో ఆత్మకూరు నుంచి కొత్తకోటకు బియ్యం తరలిస్తున్నారనే సమాచారంతో స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో వాహనాన్ని పరిశీలించామన్నారు. వాహనంలో 30 సంచుల బియ్యాన్ని గుర్తించి పౌరసరఫరా శాఖ అధికారులకు సమాచారం అందించగా.. సివిల్ సప్లయ్ డీటీ వేణు పరిశీలించి రేషన్ బియ్యంగా నిర్ధారించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ఈ మేరకు మండల కేంద్రానికి చెందిన డ్రైవర్ లక్ష్మీనారాయణ, తిర్మాలయపల్లికి చెందిన వ్యాపారి బాలస్వామిపై కేసు నమోదు చేశారు.

15 రోజుల్లో..

మండలంలో రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం జోరుగా సాగుతోంది. గ్రామాల్లో కొంతమంది రేషన్ డీలర్ల సహకారంతో వ్యాపారులు అక్రమంగా ఇతర ప్రాంతాలకు రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత నెల 24వ తేదీన 15 క్వింటాళ్లు, ప్రస్తుతం 30 సంచుల బియ్యం పట్టపగలే పట్టుకున్నారు. గుట్టుచప్పుడు కాకుండా రాత్రివేళల్లో రాయిచూర్, నారాయణపేట, వనపర్తి, మహబూబ్‌నగర్ తదితర ప్రాంతాలకు రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రేషన్ బియ్యం వ్యాపారాన్ని అడ్డుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నిందితుడికి రిమాండ్



అచ్చంపేట రూరల్: బంగారు ఆభరణాలు చోరీ చేసిన నిందితుడికి పోలీసులు సోమవారం పట్టుకున్నారు. పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ గత నెల 22న అచ్చంపేటలోని ఆదర్శనగర్ కాలనీలో రాత్రి తాళం వేసిన ఇంటిలోకి గుర్తు తెలియని వ్యక్తి ప్రవేశించి బీరువాలో ఉన్న 6 తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లాడు. బాధితుల ఫిర్యాదు మేరకు అచ్చంపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడు వింద్యాల రవీందర్‌రెడ్డిని పట్టుకునట్లు వెల్లడించారు. చోరీకి పాల్పడిన బంగారు ఆభరణాలను రికవరీ చేసి సోమవారం అచ్చంపేట కోర్టులో హాజరుపర్చారు. జడ్జి ఆదేశాల మేరకు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. నిందితుడిపై ఇదివరకు పలు పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదయ్యావని డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో సీఐ రవీందర్, ఎస్ఐ–2 ఇందిరమ్మ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం కప్ రాష్ట్రస్థాయి క్రీడలకు పాలమూరు ఆతిథ్యం


కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు (ఫైల్)

- నెట్‌బాల్, కబడ్డీ పోటీల నిర్వహణ
- 27 నుంచి జనవరి 2 వరకు జరగనున్న టోర్నీలు
- హాజరుకానున్న 33 జిల్లాల క్రీడాకారులు

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడల నిర్వహణలో పాలమూరు జిల్లాకు ప్రత్యేక గుర్తింపు ఉంది. దీంతో రాష్ట్రస్థాయి టోర్నీల కేటాయింపులో జిల్లాకు తగిన ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇటీవలే పలు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించారు.

కొనసాగుతున్న పోటీలు

రాష్ట్రంలో చీఫ్ మినిస్టర్స్ కప్–2024 క్రీడాపోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు. ఇప్పటికే గ్రామ పంచాయతీ పరిధిలో పోటీలు కొనసాగుతుండగా.. గ్రామీణ క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొంటూ ప్రతిభ చాటుతున్నారు. మంగళవారం నుంచి 12వ తేదీ వరకు మండలస్థాయి, 16వ తేదీ నుంచి 21వ తేదీ వరకు జిల్లాస్థాయి పోటీలు జరగనున్నాయి. అయితే రాష్ట్రస్థాయి నెట్‌బాల్, కబడ్డీ టోర్నీలను మహబూబ్‌నగర్‌కు కేటాయించారు.

ప్రధాన స్టేడియంలో..

నెట్‌బాల్, కబడ్డీ రాష్ట్రస్థాయి పోటీలను పాలమూరులోని ప్రధాన స్టేడియంలో నిర్వహించనున్నారు. ఈ నెల 27 నుంచి జనవరి 2 వరకు రెండు రాష్ట్రస్థాయి పోటీలు జరగనున్నాయి. రాష్ట్రంలోని 33 జిల్లాల క్రీడా జట్టు పోటీల్లో పాల్గొననున్నాయి. నెట్‌బాల్ టోర్నీకి 900 మంది క్రీడాకారులు, 30 మంది అఫీషియల్స్, కబడ్డీ పోటీలకు 792 మంది క్రీడాకారులు, 80 మంది అఫీషియల్స్ రానున్నారు. రాష్ట్రస్థాయి విజేతలకు నగదు బహుమతులు అందజేయనున్నారు.

ప్రతిభ వెలికితీసేందుకే..



క్రీడా పోటీల నిర్వహణతో గ్రామీణ క్రీడాకారుల నైపుణ్యాలు వెలుగులోకి వస్తాయి. గ్రామీణ ఔత్సాహిక క్రీడాకారులకు ఈ పోటీలు వేదికలా ఉపయోగపడుతాయి. జిల్లాకు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు కేటాయించినందుకు సంతోషంగా ఉంది. అందరి సహకారంతో విజయవంతం చేస్తాం.

– కురుమూర్తిగౌడ్, జిల్లా కబడ్డీ సంఘం ప్రధాన కార్యదర్శి, మహబూబ్‌నగర్

రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు..



మహబూబ్‌నగర్‌కు రాష్ట్రస్థాయి సీఎం కప్ నెట్‌బాల్ పోటీలు కేటాయించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు. జిల్లాకేంద్రంలో పలుమార్లు రాష్ట్ర, జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలు విజయవంతంగా నిర్వహించాం. ఈ పోటీలు కూడా ప్రతిష్టాత్మకంగా నిర్వహించడానికి మా వంతు సహకారం అందిస్తాం.

– ఖాజాఖాన్, కార్యదర్శి, నెట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ

ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తాం..



సీఎం కప్ రాష్ట్రస్థాయి నెట్‌బాల్, కబడ్డీ పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తాం. వివిధ జిల్లాల నుంచి వచ్చే క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తాం. లీగ్ పోటీలను ప్రధాన స్టేడియంలో, సెమీ ఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లను మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తాం. పోటీల విజయవంతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి.

– ఎస్.శ్రీనివాస్, డీవైఎస్ఓ, మహబూబ్‌నగర్



సాఫ్ట్‌బాల్‌లో పాలమూరు బాలికలు

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన 68వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ సాఫ్ట్‌బాల్ అండర్–17 టోర్నీలో మహబూబ్‌నగర్ జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్లో నిజామాబాద్ జట్టును ఓడించి పాలమూరు బాలికలు చాంపియన్‌షిప్ సాధించారు.

ఆర్టీసీ ఉద్యోగులు మరో యుద్ధానికి సిద్ధం కావాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: సీఎం రేవంత్‌రెడ్డి ఆర్టీసీ ఉద్యోగులకు అనుకూలంగా వారం రోజుల్లో నిర్ణయం తీసుకోవాలని, లేని పక్షంలో ఉద్యోగులు మరో యుద్ధానికి సిద్ధం కావాలని తెలంగాణ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి అశ్వత్థామరెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని టీఎన్‌జీఓ భవన్‌లో సోమవారం డిపో, రీజియన్, జోనల్, రాష్ట్ర కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, యూనియన్లను పునరుద్ధరించాలని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతాలు పెంచాలని, కార్మికులకు ఆర్థికంగా ఉన్న సమస్యలను వెంటనే తీర్చాలని తీర్మానించారు. ఈ సందర్భంగా అశ్వత్థామరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన హామీలన్నింటిని అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ తీపి కబురు కోసం సంవత్సరం నుంచి ఎదురుచూస్తున్నామని, ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టీఎంయూ గౌరవ అధ్యక్షుడు శంకర్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి వీసీఎస్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు యాదయ్య, నిరంజన్, నాగయ్య, నాయకులు రవీందర్‌రెడ్డి, భానుప్రకాశ్‌రెడ్డి, నారాయణ, నరసింహ, శివరాణి, రాజు, శ్రీనివాసులు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నెట్టెంపాడు పంపింగ్


నెట్టెంపాడు ఎత్తిపోతల వద్ద నీటి ప్రవాహం

గద్వాల(ధరూరు) : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి స్వల్పంగా ఇన్‌ఫ్లో కొనసాగుతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. సోమవారం సాయంత్రం వరకు ప్రాజెక్ట్‌కు 963 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుందన్నారు. నెట్టెంపాడు ఎత్తిపోతలలో ఒక పంపు ద్వారా నీటి పంపింగ్ కొనసాగిస్తున్నట్లు తెలిపారు. నెట్టెంపాడుకు 750 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 69 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 390 క్యూసెక్కులు, సమాంతర కాలువకు 900 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–2కు 855క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 2,109 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 8.770 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

రామన్‌పాడులో 1,020 అడుగుల నీటి మట్టం..

మదనాపురం : రామన్‌పాడులో సోమవారం పూర్తి స్థాయి నీటిమట్టం 1,020 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాలువ ద్వారా 390 క్యూసెక్కులు, సమాంతర కాలువ ద్వారా 900 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఎన్టీఆర్ కాలువ ద్వారా 490 క్యూసెక్కులు కుడి, ఎడమ కాలువ ద్వారా 55 క్యూసెక్కులు వివిధ లిఫ్టుల ద్వారా 855 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు.

శ్రీశైలం జలాశయానికి 12,941 క్యూసెక్కులు..

దోమలపెంట : భూగర్భ కేంద్రంలో పంప్‌మోడ్ పద్ధతిలో గత ఇరవై నాలుగు గంటల వ్యవధిలో శ్రీశైలం ఆనకట్ట దిగువన సాగర్ జలాశయం నుంచి శ్రీశైలం జలాశయానికి 12,941 క్యూసెక్కుల నీటిని (ఎత్తిపోతల) తరలించారు. పోతిరెడ్డిపాడు ద్వారా 1,500, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,617, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకెఎల్ఐకు 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. సోమవారం శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం 864.3 అడుగుల వద్ద 120.0754 టిఎంసీల నీటి నిల్వ ఉంది. భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేశారు.

గుండుమాల్ ప్రాంతంలో చిరుత సంచారం


ఘటన స్థలంలో ఆధారాలు సేకరిస్తున్న అటవీశాఖ అధికారి

కోస్గి: మేకపై చిరుత దాడి చేసి చంపిన ఘటన గుండుమాల్ పరిసర ప్రాంతాల్లో కలకలం రేపింది. బాధితుల కథనం మేరకు గుండుమాల్‌కు చెందిన ఫయాజ్ అలీ తన మేకలను మేపడానికి కాపరికి అప్పగించాడు. ఈ క్రమంలో గుండుమాల్–పగిడియాల్ మార్గంలో ఉన్న మందపై ఆదివారం రాత్రి చిరుత దాడి చేసి, ఓ మేకను ఎత్తుకెళ్లి సమీపంలోనే చంపేసింది. ఈ విషయంపై గ్రామస్తులు సోమవారం అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్ లక్ష్మణ్ నాయక్ తెలపడంతో ఆయన ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పాద ముద్రల ఆధారంగా మేకపై చిరుత పులి దాడి చేసిందని నిర్ధారించి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చామని సెక్షన్ అధికారి తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అవసరమైతే చిరుతను పట్టుకునేందుకు ప్రత్యేక బోన్ ఏర్పాటు చేస్తామన్నారు. గుండుమాల్ ప్రాంతంలో చిరుత సంచార విషయం విస్తృతంగా ప్రచారం కావడంతో రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు

- ఏఎస్పీ రామేశ్వర్

నాగర్‌కర్నూల్ క్రైం : మహిళలను వేధింపులకు గురిచేసిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ రామేశ్వర్ అన్నారు. రెండు రోజుల క్రితం బిజినేపల్లి మండల కేంద్రంలో పాఠశాల విద్యార్థినులను వేధింపులకు గురిచేసిన ఇద్దరు పోకిరీలకు స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ జైలుశిక్షతో పాటు జరిమానా విధించినట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇద్దరు పోకిరీలు వేధింపులకు గురిచేస్తుండగా విద్యార్థినులు షీటీంను సంప్రదించడంతో షీటీం ఇన్‌చార్జి ఏఎస్సై విజయలక్ష్మి, హెడ్‌కానిస్టేబుల్ వెంకటయ్య వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా, విచారణ అనంతరం పోకిరీలకు ఏడు రోజుల జైలు శిక్షతో పాటు రూ. 2వేల జరిమానా విధించినట్లు ఏఎస్పీ పేర్కొన్నారు.

కొండచిలువ కలకలం



కందనూలు: జిల్లా కేంద్రంలోని నల్లవెల్లి రోడ్డులో ఓ ప్రైవేటు పాఠశాల మైదానంలోకి సోమవారం కొండచిలువ రావడం కలకలం రేపింది. ఉదయం పాఠశాలలోకి కొండచిలువ వెళ్లడం గమనించిన స్థానికులు పాఠశాల సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అక్కడ చేరుకున్న పాఠశాల సిబ్బంది వెంటనే స్నేక్ క్యాచర్‌కు సమాచారం అందించారు . వెంటనే స్పందించిన వారు వచ్చి కొండచిలువను పట్టుకొని, జనారణ్యం లేని ప్రాంతంలో వదిలివేశారు. కొండచిలువ పాఠశాలలోకి వెళ్లిన సమయంలో విద్యార్థులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

సారూ.. విషపు పురుగులు వస్తున్నాయ్


కేజీబీవీలో వంట సరుకుల గదిని పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ యాదయ్య

అమరచింత: సారూ.. మా పాఠశాల లోపలికి విషపురుగులు వస్తున్నాయి.. అని స్థానిక కేజీబీవీ విద్యార్థినులు అదనపు కలెక్టర్ యాదయ్యకు విన్నవించారు. సోమవారం రాత్రి మండలంలోని పామిరెడ్డిపల్లి శివారులో ఉన్న కేజీబీవీని ఆకస్మికంగా పరిశీలించేందుకు ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ యాదయ్య రాగా.. విద్యార్థినులు తాము నిత్యం ఎదుర్కొంటున్న సమస్యను వివరించారు. చుట్టుపక్కల పంట పొలాలు ఉండటంతో తరగతి గదుల్లోకి తేళ్లు, విషపురుగులు వస్తున్నాయని ఆరోపించారు. ఈ విషయమై కేజీబీవీ ఎస్ఓను అడిగి వివరాలు తెలుసుకున్నారు. సమస్యను పరిష్కరించేందుకు కృషిచేస్తామన్నారు. అనంతరం వంట గదితోపాటు సరుకులను భద్రపరిచే గదులను పరిశీలించారు. భోజనం ఎలా ఉంటుందని విద్యార్థినులను అడగగా బాగుందని చెప్పారు. రాత్రివేళ వరండాల్లో చదువుకునేందుకుగాను లైటింగ్ సరిగా లేకపోవడంతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారని గమనించినట్లు ఆయన చెప్పారు. పాఠశాలకు కావాల్సిన సౌకర్యాల గురించి ఉన్నతాధికారులకు విన్నవిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీపీఓ సురేష్‌కుమార్, ఎంపీడీఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతుల రాస్తారోకో


ఓబ్లాయిపల్లి శివారులోని పత్తి కొనుగోలు కేంద్రం ఎదుట రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

- కొనుగోళ్లలో జాప్యంపై రోడ్డుపై బైఠాయించిన రైతులు
- ఓబ్లాయిపల్లి సీసీఐ కేంద్రం వద్ద బారులు తీరిన వాహనాలు
- హైదరాబాద్ – రాయచూర్ ప్రధాన రహదారిపై నిలిచిన రాకపోకలు

మహబూబ్‌నగర్ రూరల్: మండల పరిధిలోని ఓబ్లాయిపల్లి గ్రామ శివారులో ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రంలో పత్తి కొనుగోళ్లలో జాప్యాన్ని నిరసిస్తూ సోమవారం రైతులు రాస్తారోకో నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు హైదరాబాద్-రాయచూర్ రహదారిపై రైతులు బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదించారు. పత్తి కొనుగోలు కేంద్రం బయట రోడ్డుకు ఇరువైపులా కాటన్‌లోడ్‌తో వచ్చిన ట్రాక్టర్లు, ఇతర వాహనాలు వరుసగా నిలిపారు. వీటికి తోడు హైదరాబాద్, రాయచూర్‌ల వైపు వెళ్లే వాహనాలు పెద్ద ఎత్తున జామ్ కావడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఒకవైపు మద్దతు ధర లేక, మరోవైపు అమ్మడానికి అష్టకష్టాలు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరుగాలం కష్టపడి పండించిన పత్తి అమ్మడానికి కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే రోజుల తరబడి నిరీక్షించాల్సి వస్తుందని వాపోయారు. పత్తి వద్ద జాగరణ చేయాల్సిన పరిస్థితి ఉందని, తమ బాధ అధికారులకు పట్టడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సీసీఐ అధికారులు స్పందించి పత్తి కొనుగోలు జాప్యంపై దృష్టి సారించి రైతులు అమ్మకానికి తెచ్చిన పత్తిని వెనువెంటనే కొనుగోలు కాంటా అయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చివరకు పోలీసులు రంగప్రవేశం చేసి రోడ్డుపై బైఠాయించిన రైతులను సముదాయించి సీసీఐ కొనుగోలు కేంద్రంలోకి తీసుకెళ్లి పత్తి కొనుగోలు త్వరగా పూర్తయ్యేలా చూస్తామని కేంద్రం నిర్వాహకులతో హామీ ఇప్పించడంతో వారు ఆందోళన విరమించారు. కాగా..మహబూబ్‌నగర్ వైపు నుంచి రాయచూర్ వైపు.. రాయచూర్ వైపు నుంచి మహబూబ్‌నగర్ వైపు వెళ్లే పలు వాహనాలను దారి మళ్లించి కోటకదిర, పోతన్‌పల్లి, మాచన్‌పల్లి, కోడూర్ మీదుగా రాకపోకలు సాగించారు.

సంగమేశ్వర శిఖరానికి.. ప్రత్యేక పూజలు


కృష్ణానదిలో తేలిన సంగమేశ్వర ఆలయ శిఖరం..

ఆలయ శిఖరానికి పూజలు చేస్తున్న అర్చకులు రఘురామశర్మ

కొల్లాపూర్: మార్గశిర మాసం రెండో సోమవారం సంగమేశ్వరాలయ శిఖరానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొన్ని నెలలుగా కృష్ణానదిలో మునిగిన సంగమేశ్వర ఆలయ శిఖర భాగం ఇటీవల తేలిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఆలయ అర్చకులు రఘురామశర్మ మరబోటులో వెళ్లి పంచలోహ ఈశ్వరుడి ప్రతిమను శిఖరానికి ఏర్పాటు చేశారు. శాస్త్రోక్తంగా శిఖరానికి పూజలు నిర్వహించి, హారతి ఇచ్చారు. నంద్యాల జిల్లా భూభాగంలో ఉండే ఈ ఆలయ శిఖరాన్ని దర్శించుకునేందుకు ప్రతిరోజూ భక్తులు మరబోట్లలో వెళ్లి వస్తున్నారు.

పోలింగ్ కేంద్రాలపై కసరత్తు

- పంచాయతీ వార్డులు, ఓటర్ల సంఖ్య ఆధారంగా గుర్తింపు
- పోలింగ్ కేంద్రాల జాబితా తయారీలో జిల్లా యంత్రాంగం నిమగ్నం
- 10న జిల్లాస్థాయి, 12న మండలస్థాయి నాయకులతో సమావేశం
- 17న పోలింగ్ కేంద్రాల తుది జాబితా విడుదల



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పంచాయతీ ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం సిద్ధమవుతోంది. అందులో భాగంగా గ్రామ పంచాయతీల్లో పోలింగ్ కేంద్రాలను గుర్తించి, జాబితా రూపొందించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే ఓటరు తుది జాబితా పరిశీలనలో అధికారులు తలమునకలై ఉన్నారు. ఈ ప్రక్రియ అనంతరం పోలింగ్ కేంద్రాల పరిశీలన చేపట్టనున్నారు. పోలింగ్ కేంద్రాల స్థితిగతులపై ఎన్నికల సంఘానికి నివేదికలు పంపించనున్నారు. జిల్లాలో 441 గ్రామ పంచాయతీలు ఉండగా 14 మండలాలు, 3638 వార్డులు ఉన్నాయి. ఈ నెల 7వ తేదీన పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితా విడుదల చేశారు. కేంద్రాల ఏర్పాటు బాధ్యతను మండల పరిషత్ అధికారులకు అప్పగించారు. ఈ నెల 7న ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితాను ఎంపీడీఓలచే ప్రచురణ చేశారు. 10న జిల్లా స్థాయిలో ఎన్నికల అధికారులు ముసాయిదా జాబితాపై రాజకీయ పార్టీల నాయకులతో సమీక్ష నిర్వహించనున్నారు. 12న మండల స్థాయిలో అధికారులు రాజకీయ నాయకులతో సమావేశమై చర్చిస్తారు. ముసాయిదా కేంద్రాల జాబితాపై ఈ నెల 7నుంచి 12వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. 13న స్వీకరించిన అభ్యంతరాలు పరిష్కరిస్తారు. 16న కలెక్టర్ ఆమోదం తర్వాత 17న మండల అధికారులు తుది జాబితా విడుదల చేస్తారు.

మహిళా ఓటర్లే అధికం..

జిల్లా పంచాయతీ ఎన్నికల్లో భాగంగా నవంబర్ 30 తేదీన ఓటర్ తుది నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. దీని ప్రకారం జిల్లాలో మొత్తం 5,27,302 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 2,62,558, మహిళలు 2,64,736 మంది ఉన్నారు. 8 మంది ఇతరులు. ఈ ఓటర్ జాబితా ప్రకారం పురుష ఓటర్లతో పోల్చితే మహిళా ఓటర్లు 2178 మంది అధికంగా ఉన్నారు.

మౌలిక వసతులపై దృష్టి..

పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, దివ్యాంగుల కోసం ర్యాంప్‌లు, టాయిలెట్స్ వంటి వసతుల కల్పనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. సౌకర్యాల కల్పనకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. అదే విధంగా ఓటర్లకు దూరా భారం తగ్గించేందుకు సమీపంలోని భవనాలు ఎంపిక చేయనున్నారు.

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు..

రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో పోలింగ్ కేంద్రాలను గుర్తించి జాబితా సిద్ధం చేస్తున్నాం. ఈ నెల 17 వరకు తుది జాబితా విడుదల చేస్తాం. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– పార్థసారథి, డీపీఓ